సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024



పని'గట్టు'కుని

ఎల్ఎన్ పేటలో చెరువు గట్టు ఆక్రమించేస్తున్నారు. ఇష్టానుసారం భవనాలు నిర్మిస్తున్నారు. - 8లో



ఆలయంలో చోరీ

ఫరీదుపేట రంగనాథ స్వామి ఆలయంలో చోరీ జరిగింది. పోలీసులకు ఫిర్యాదు చేశారు. - 8లో

డీఎస్పీలకు స్థాన చలనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు బదిలీపై ముగ్గురు డీఎస్పీలు వస్తున్నట్లు ఆదివారం మంగళగిరి డీజీపీ కార్యాలయం నుంచి డీజీపీ ద్వారకాతిరుమల రావు ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీ డీఎస్పీగా ఉన్న ఎ.జి.జి.తిలక్ కాశీబుగ్గ డివిజన్‌కు, ఏఎన్‌టీఎఫ్‌లో వెయిటింగ్ అటాచ్డ్‌గా ఉన్న డీఎస్పీ జి.రాజశేఖర్ శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్‌కు, వెయిటింగ్ డీఎస్పీగా ఉన్న డీఎస్‌వీ ప్రసాద్ శ్రీకాకుళం డీటీసీకి రానున్నారు.

ప్రభుత్వం కనికరించాలి

మా లాంటి పేద దళితులను ప్రభుత్వం కనికరించాలి. మా పాపను మెడిసిన్ చది విస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో 450 లోపు మార్కులు వస్తే ఎక్కడైనా ప్రభు త్వ కళాశాలలో సీటు వచ్చేది. ఇప్పుడు 500 దాటుతున్నా సీటు రావడం కష్టమంటున్నారు. అలాంటప్పుడు జనరల్ కేటగిరీ వారికి మాకు తేడా ఏంటి. ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు పెంచితే బాగుంటుంది.

– రాకోటి చిన్నికృష్ణ, బైరివానిపేట





పునరాలోచించాలి..

మెడికల్ సీట్ కొట్టేందుకు మా పాప లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ కాలేజీలో సీట్లు రద్దు చేస్తే మేము ఖర్చుపెట్టినదంతా వృధా అవుతున్నట్టే. ప్రభుత్వం ఒకసారి పునరాలోచిస్తే మంచిది.

– కోదండరామయ్య, శ్రీకాకుళం



మిడ్‌నైట్ దోపిడీ

- రాత్రిపూట ప్రతి రోజూ 1000కి పైగా వాహనాల్లో తరలిపోతున్న ఇసుక
- పచ్చనేతలకు రూ.కోట్లు కురిపిస్తున్న ఉచిత ఇసుక
- వంశధార, నాగావళి నదులను తోడేస్తున్న అక్రమార్కులు
- ఫోన్ ద్వారా బుకింగ్
- ఫోన్‌పే ద్వారా చెల్లింపులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

- అధికార పార్టీ నాయకులకు ఉచిత ఇసుక కాసులు కురిపిస్తోంది. బూర్జ మండలం నారాయణపురం, చిన అంకలాం వద్ద రాత్రికి రాత్రే తవ్వకాలు జరిపి, భారీ లారీల్లో ఇసుక తరలించేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.35వేల నుంచి రూ.40వేలకు పైగా విక్రయిస్తున్నారు. రాత్రి 12గంటల నుంచి ఉదయం 4 గంటల్లోపు వందలాది లారీల ఇసుక తరలిపోతోంది.
- శ్రీకాకుళం రూరల్ పరిధిలోని భైరి, కరజాడ, కళ్లేపల్లి, కిల్లిపాలెం, బట్టేరు, బూరవల్లి, లొద్దలపేట, సింగూరు, నైరాతో పాటు గార, పొన్నాం నుంచి రాత్రిపూట పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలిపోతోంది. పచ్చనేతల కనుసన్నల్లో దర్జాగా దోపిడీ జరుగుతోంది. తెల్లవారయ్యేసరికి తమ పని కానిచ్చేస్తున్నారు. ప్రజలు నిద్రలేచే లోపు దందా ముగించేస్తున్నారు. ఒక్కొక్క లారీకి రూ. 30వేలకు వసూలు చేసి అప్పనంగా సంపాదిస్తున్నారు.
- ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ, దూసి, తోటాడ, అక్కివరం, తొగరాం, బెలమం, కొత్తవలస వద్ద లారీలు, ట్రాక్టర్లతో అర్ధరాత్రి దాటాక ఇసుక తరలించేస్తున్నారు. ఆ సమయంలో అటువైపుగా వెళ్లే లారీల జాతర కనిపిస్తోంది. విశాఖ, అనకాపల్లి వరకు ఇక్కడి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. లారీ ఇసుకను రూ. 35 వేలకు పైగా విక్రయించి తెలుగు తమ్ముళ్లు భారీగా లబ్ధిపొందుతున్నారు. పొందూరు మండలం సింగూరు నుంచి ఇదే రకంగా ఇసుక దోపిడీ జరుగుతోంది.
- నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని మడపాం, లుకలాం, బుచ్చిపేట, చేనులవలస, చెవ్వాకులపేట, గోపాలపెంట, పర్లాం, దొంపాక, ఉర్లాం నుంచి భారీగా ఇసుక తరలిపోతోంది. అధికార పార్టీ నాయకులు దర్జాగా ఇసుక దోపిడీ చేస్తున్నారు. ఒక్కో లారీకి రూ. 30వేల నుంచి రూ.35వేలకు వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు.



జలుమూరు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఇసుక లారీలు

- పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు, హిరమండలం తదితర ప్రాంతాల నుంచి రాత్రిపూట గుట్టు చప్పుడు కాకుండా ఇసుక తరలిపోతోంది. ఒక్కసారిగా లారీల తాకిడి ఎక్కువవడం వల్ల స్థానికుల తీవ్ర అసౌకర్యం కలగడంతో ఇటీవల ఆకుల తంపర నుంచి విశాఖకు తరలిస్తున్న ఇసుక లారీలను రామకృష్ణాపురం, సోమరాజపురం గ్రామస్తులు పట్టుకుని అధికారులకు అప్పగించారు.

ఇలా చెప్పుకుంటే జిల్లాలో ఇసుక దొరికే ప్రతి ప్రాంతంలో మిడ్‌నైట్ దందా నడుస్తోంది. అక్రమార్కులు మాఫియాగా తయారై ఇసుక దోచేస్తున్నారు. వంశధార, నాగావళి నదులను తోడేసి, నిశీధిలో కోట్లు గడిస్తున్నారు. అంతా ఫోన్‌లోనే వ్యాపారం చేసేస్తున్నారు. వంశధార, నాగావళికి ఆనుకుని ఎక్కడెక్కడ ఇసుక అక్రమ విక్రయాలు జరుగుతున్నాయి? ఎవరు చేస్తున్నారు? ఎవరిని కాంటాక్ట్ చేస్తే పని అవుతుందనే సమాచారం ముందే లీకు చేసి అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ముఖ్యంగా విశాఖపట్నం, గాజువాక, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన లారీల సిబ్బంది.. ఆ వ్యక్తులను సంప్రదించి, తమకు కావాల్సినంత తీసుకెళ్తున్నారు. చెల్లింపులు కూడా ఫోన్‌పేలోనే జరిగిపోతున్నాయి. లావాదేవీలంతా పగలు జరగ్గా, ఇసుక తరలింపు అర్ధరాత్రి తర్వాత చేస్తున్నారు. ఇసుక దోపిడీ దారులు పక్కా ప్లాన్ ప్రకారం చేస్తున్నారు. ఇసుక తరలించే సమయంలో కిలోమీటర్‌కు ఒక వ్యక్తిని పెట్టి, వెళ్లే మార్గంలో ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందుల్లేవని నిర్ధారించుకున్నాక ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. భారీ లారీలకు ఇసుక లోడ్ చేసేందుకు వంశధార, నాగావళి నదిలోని అక్రమ పాయింట్ల వద్ద ఏకంగా జేసీబీలు, పొక్లెయినర్లు వినియోగిస్తున్నారు.



అధికారులకు తెలుసా?

అధికారుల కళ్లు గప్పి అక్రమార్కులు పక్కా ప్లాన్ ప్రకారం ఇసుక దందా చేస్తున్నారు. పగలంతా నదులకు వెళ్లే మార్గాల్లో ట్రెంచ్‌లు తవ్వేసి ఉంటాయి. రాత్రికి కప్పేసి అదే దారి గుండా భారీ వాహనాలతో ఇసుక తరలిస్తున్నారు. తెల్లవారే సరికి మళ్లీ అక్కడ ట్రెంచ్‌లు కన్పిస్తుంటాయి. పగలు చూసే వారికి అక్కడెటువంటి తవ్వకాలకు, తరలింపునకు ఆస్కారం లేదని అభిప్రాయాన్ని కలిగించి దోపిడీ పర్వాన్ని సాగిస్తున్నారు. కొన్నిచోట్ల నేరుగా ర్యాంపుల్లోకి వాహనాలు రానవసరం లేకుండా గుట్టు చప్పుడుగా సిద్ధం చేసిన ఇసుక పోగుల వద్దకు రప్పించి ఇసుకను రవాణా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అర్ధరాత్రి దాటాక రోజుకి 1000 లారీలకు పైగా ఇసుక తరలిపోతున్నట్టుగా తెలుస్తోంది. ఒక్కో లారీకి రూ. 30వేల నుంచి రూ. 40వేలు వరకు వసూలు చేస్తున్నారు. దీన్నిబట్టి జిల్లాలో ప్రతి రోజూ రూ.3కోట్ల నుంచి రూ.4కోట్ల వరకు ఇసుక దోపిడీ జరుగుతున్నట్టుగా స్పష్టమవుతోంది. ప్రభుత్వం చెబుతున్న ఉచిత ఇసుక విధానంతో ప్రజలకు మేలు జరకపోయినా అధికార పార్టీ నాయకులకు మాత్రం దండిగా కాసులు కురిపిస్తోంది. దీన్ని ఆపే పరిస్థితి లేదు. ఒకవేళ ఎక్కడైనా వాహనాలు పట్టుబడితే ఒడిశా నుంచి తీసుకొస్తున్నట్టుగా ఒడిశా రశీదులు చూపిస్తూ తప్పించుకుంటున్నారు. ఒడిశా నుంచి ఆ రశీదులు ముందే తెప్పించుకుని రవాణా లారీలకు ఇస్తున్నారో...లేదంటే ఒడిశా పేరుతో రశీదులను డూప్లికేట్‌గా ముద్రించి రవాణాదారులకు అందిస్తున్నారో తెలియడం లేదు గాని ఒడిశా రశీదులు కూడా పెద్ద ఎత్తున జిల్లాలో హల్‌చల్ చేస్తున్నాయి.

మూడు ఇసుక లారీలు సీజ్

జలుమూరు: మాకివలస నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను సీజ్ చేసి జలుమూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్‌ఐ బి.అశోక్‌బాబు ఆదివారం తెలిపారు. నరసన్నపేట సీఐ శ్రీనివాసరావుతోపాటు సిబ్బంది మాకివలస వంశధార నది నుంచి తరలిస్తున్న వాహనాలను మాటు వేసి పట్టుకున్నారని పేర్కొన్నారు. ఇసుకను ఆయా వాహనాల్లో లోడింగ్ చేసేందుకు వినియోగించిన జేసీబీ, ఒక కారును కూడా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

తప్పించుకున్న మరో మూడు వాహనాలు

ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి మూడు లారీలు పట్టుకునే లోపే మరో మూడు లారీలు కొమనాపల్లి వంతెన దాటిపోయినట్లు సమాచారం. కాగా దాడిలో దొరికిన మూడు వాహనాల్లో రెండు కోటబొమ్మాళి మండలం మంచాలపేటకు చెందిన ఓ టీడీపీ నాయకుడివి కాగా మరో లారీ నరసన్నపేటకు చెందిన ఓ టీడీపీ నాయకుడిదని సమాచారం.

ఇసుక పోగుల మాటేమిటి ?

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు వాహనాలను, కారు, జేసీబీని పోలీసులు పట్టుకున్నారు. కానీ అక్కడ స్థానిక టీడీపీ నాయకుడు కల్లాలో నిల్వ ఉంచిన సుమారు 60 నుంచి 70 టన్నులు ఇసుక పోగులపై చర్యలు లేవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ ఇసుక పోగులను సీజ్ చేస్తే అటు ప్రభుత్వానికి ఆదాయం ఇటు ఇసుకాసురులు మరో సారి ఇలా తరలించేందుకు భయపడతారని పలువురు భావిస్తున్నారు. దీనిపై ఎస్‌ఐ అశోక్‌బాబు మాట్లాడుతూ నిల్వ చేసిన ఇసుక పోగులు చూసే బాధ్యత రెవెన్యూ శాఖదన్నారు. తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణను వివరణ కోరగా వీఆర్వోను పంపించి ఇసుక పోగుల నిల్వలు సీజ్ చేస్తామన్నారు.

నేడు మీకోసం రద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) వినతుల స్వీకరణ కార్యక్రమం లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మిలాదిన్‌నబీ ప్రభుత్వ సెలవు దినం సందర్భంగా వినతుల స్వీకరణ కార్యక్రమం ఈ వారం నిర్వహించడం లేదని తెలిపారు. ఎస్పీ గ్రీవెన్స్ కూడా రద్దు చేశారు.

'మోక్షగుండం'కు ఘనంగా నివాళి



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అరసవల్లి: మోక్షగుండం విశ్వేశ్వరయ్యను యువ ఇంజినీర్లు ఆదర్శంగా తీసుకోవాలని పీఆర్ ఇంజినీర్లు అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా శ్రీకాకుళంలోని జెడ్పీ ఆవరణలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పీఆర్ ఇంజినీర్లు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నగరంలోని బెహరా మనోవికాసకేంద్రంలోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించి 47 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

17న విశ్వకర్మ జయంతి వేడుకలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశ్వకర్మ భగవానుడి గొప్పదనాన్ని గుర్తించి రాష్ట్ర పండుగగా సెప్టెంబర్ 17వ తేదీన 'విశ్వకర్మ జయంతి'ని జరుపుకోవడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచనల మేరకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెప్టెంబర్ 17న మంగళవారం ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమానికి విశ్వ బ్రాహ్మణ సంఘ సభ్యులు, కుల పెద్దలు, వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బి.అనురాధ కోరారు.

న్యూస్‌రీల్

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక, విశిష్ట, ఉచిత దర్శన మార్గాల్లో ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంతరాలయంలో ప్రత్యేక దర్శనంతో పాటు గోత్రనామాలతో పూజలు చేసేలా ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ చర్యలు చేపట్టారు. ఒక్క రోజులో వివిధ దర్శన టికెట్ల ద్వారా రూ.1, 26,700, విరాళాల ద్వారా రూ.48007, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.35లక్షలు ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని 2023–24కు గాను ప్రకటించిన వివిధ అవార్డులకు పర్యాటక సంబంధిత రంగాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా మాదిరిగానే మొత్తం 38 విభాగాల నుంచి 41 అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తులను ఏపీ టూరిజం వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, పూర్తి చేసిన వాటిని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడలో ఈనెల 22వ తేదీ లోపు అందజేయాలని కోరారు.

శ్రీకాకుళం అ'ద్వితీయ'ం



నిర్వాహకులు, అతిథుల చేతులమీదుగా రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న జిల్లా బాలురు జట్టు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా జట్లు అదిరేటి ఆట తీరుతో విజయబావుటా ఎగురవేశాయి. తూర్పుగోదావరి జిల్లా అన్నవరం వేదికగా ఈనెల 13 నుంచి 15 వరకు ఏపీ రాష్ట్ర స్థాయి సబ్–జూనియర్స్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా బాలుర జట్టు రన్నరప్‌గా నిలవగా, బాలికల జట్టు తృతీయస్థానంలో నిలిచింది. జిల్లా జట్ల రాణింపుపై బాల్ బ్యాడ్మింటన్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు పీవీజీ కృష్ణంరాజు ఆనందం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి ఖోఖో జట్ల ఎంపిక

జె.పంగులూరు: జాతీయ, రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈనెల 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయ, రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికల జట్ల ఎంపిక పూర్తి చేసినట్లు ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆదివారం తెలిపారు. బాపట్ల జిల్లా పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో రాష్ట్ర బాలబాలికల జట్లు ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి 170 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, వారిలో మంచి ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈఎంపికలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచుగరటయ్య మాట్లాడుతూ అనివార్య కారణాల వలన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ పోటీలు నిర్వహించలేకపోయినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు గ్రామస్తుల సహకారంతో పంగులూరులో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో రాష్ట్ర జట్టు మంచి ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి బాలుర జట్టు

ఎ.శ్రీనివాసరావు (ప్రకాశం), పి.వెంటేశ్వర్లు (ప్రకాశం), డి.బాజీవలి (ప్రకాశం), ఎన్.భవాని శంకర్ (కృష్ణ), టి.మిట్టు (విశాఖ), డి.రవి (శ్రీకాకుళం), ఎస్.వీరేంద్ర (ఈస్టు గోదావరి), ఆర్.బాలాజీ (కర్నూలు), వి.సాగర్ (ప్రకాశం), ఎం.పవన్ (విజయనగరం), పి.జ్యోతిరామ్ (అనంతపురం), సీహెచ్ నారాయణరెడ్డి (ప్రకాశం), బద్రీనాథ్ (చిత్తూరు), బి.రాయన్ పాల్ (గుంటూరు), గౌతం (నెల్లూరు).

రాష్ట్ర బాలికల జట్టు

ఆర్.సరస్వతి (శ్రీకాకుళం), ఎస్.భానుప్రియ (ప్రకాశం), ఎం.ధనలక్ష్మి (విజయనగరం), కె.భవాని (నెల్లూరు), వై.భవాని (శ్రీకాకుళం), జి.లక్ష్మి (చిత్తూరు), ఆర్.లలిత దేవి (విశాఖపట్నం), కె.వైశాలి (ప్రకాశం), డి.యోదిత (కృష్ణ), ఎ.స్వప్న (అనంతపురం), వి.శిరీష (కర్నూలు), టి.ప్రియ (ఈస్టు గోదావరి), కె.రేణుక (వెస్టు గోదావరి), పి.శివమణి (గుంటూరు), ఎం.హర్షిత శ్రీ (కృష్ణ).

ఆట అదిరింది

- ఉత్సాహంగా కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానంలో కొన్న చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024 పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. క్రీడలతో ఆరోగ్యవంతమైన సమ సమాజ నిర్మాణం సాధ్యపడుతుందని శ్రీకాకుళం, రాజాం ఎమ్మెల్యేలు గొండు శంకర్, కోండ్రు మురళీమోహన్ పేర్కొన్నారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై కొన్న చిన్నారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 600 మీటర్ల పరుగుపందెంను జెండా ఊపి ప్రారంభించారు. ఈవెంట్లలో విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కొన్న చిన్నారావు కుమారుడు, విశాఖపట్నం వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ ఆఫీసర్ కొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ తండ్రి కొన్న చిన్నారావు మెమోరియల్ పేరిట కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆప్తుల సహకారంతో గత 16 ఏళ్లగా క్రీడాపోటీలను నిర్వహిస్తుండటం ఆనందంగా ఉందన్నారు.

ముగింపు కార్యక్రమానికి కూన, దాసన్న

సాయంత్రం జరిగిన ముగింపు, బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర,జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి తదితరులు హాజరై పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఒక ప్రభుత్వం చేయాల్సిన పనిని ఒక కుటుంబం చేస్తుండటం గొప్ప విషయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. వెటరన్ నేషనల్ అథ్లెట్ బి.బాలాజీ(బిలాస్‌పూర్)ను ఘనంగా సత్కరించారు. మీట్‌కు జిల్లా నలుమూలల నుంచి రికార్డు స్థాయిలో 700 మందికి పైగా క్రీడాకారులు తరలివచ్చారు. ఇక్కడి విజేతలు గుంటూరు రాష్ట్రపోటీలకు ఎంపికయ్యారు.



నేషనల్ అథ్లెట్ బి.బాలాజీని ఘనంగా సత్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యే కూన రవి తదితరులు



హైజంప్‌లో ఓ క్రీడాకారిణి విన్యాసం

32 కిలోల గంజాయి స్వాధీనం

ఇచ్ఛాపురం:

పట్టణాన్ని కేంద్రంగా చేసుకుని గంజాయిని అక్రమ రవాణా చేసేందుకు ప్రయత్నించిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని అడిషనల్ ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం సీఐ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఒడిశాలోని మోహనబ్లాక్ నుంచి గంజాయిని అక్రమంగా రోడ్డు మార్గం గుండా తీసుకొచ్చి ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ నుంచి ముంబైకి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా పట్టణ పోలీసులు పట్టుకొన్నారు. తనిఖీలో వీరి వద్ద గల రెండు బ్యాగులు, ఒక సూట్‌కేసులో 32.470 కేజీల గంజాయిని గుర్తించారు. వెంటనే వీరి వద్ద గల గంజాయిని స్వాధీనం చేసుకొని ఒడి శాలోని గజపతిజిల్లా, మోహనబ్లాక్ ఖరియాగుడా గ్రామానికి చెందిన ఇద్దరు యువతులు రేష్మనాయక్, సుమితనాయక్, రాయిజుక గ్రామానికి చెందిన గజేంద్రనాయక్‌లను అరెస్టు చేసినట్టు తెలిపారు. పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకొన్న ఇచ్ఛాపురం పట్టణ పోలీసుల బృందానికి ఎస్పీ అభినందనలు తెలియజేసి రివార్డుని ప్రకటించారని వెల్లడించారు.



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు

వంటింటిలో మంట

- నూనెల దిగుమతులపై కేంద్రం సుంకం పెంపు
- 12.5 నుంచి 32.5శాతం వరకు పెంచిన ప్రభుత్వం
- లీటరుకు రూ.20 నుంచి రూ.25 పెరుగుదల
- ఇప్పటికే నూనె ప్యాకెట్ల కృత్రిమ కొరత

హిరమండలం: సామాన్యుడి వంట ఇంటిలో నూనె మంట రాజుకుంటోంది. కొద్ది రోజులుగా స్థిరంగా ఉన్న నూనెల ధరలు ఒక్కసారి భగ్గుమన్నాయి. శనివారం మధ్యాహ్నం వరకు సాధారణ ధరలకు నూనె ప్యాకెట్లు విక్రయించిన వ్యాపారులు.. ఆ తర్వాత ఒక్కసారిగా నూనె ప్యాకెట్లను బ్లాక్ చేయడం, అధిక ధరకు విక్రయించడం ప్రారంభించారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపించింది. దీంతో కొనుగోలు దారులు అయోమయ పరిస్థితిలో పడిపోయారు. శుద్ధి చేసిన ఎడిబుల్ ఆయిల్‌పై కేంద్ర ప్రభుత్వం 32 శాతానికి పైగా దిగుమతి సుంకం పెంచడంతో ధరలకు రెక్కలొచ్చాయి. లీటర్ నూనెలపై ఏకంగా దాదాపు 30శాతం ధరలు పెరగడంతో సామాన్యుడి మీద పెనుభారమే పడుతోంది. సరైన పంటలు పండక రైతులు, కూలీలు, సంక్షేమ పథకాలు అందక పేద ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్న తరుణంలో పెరిగిన వంటనూనెల ధరలు మరింత కలవరపడేలా చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలు అన్నదాతలకు తీవ్ర నష్టం మిగిల్చాయి. ఈ సమయంలో కేంద్రం ముడి చమురు, శుద్ధి చేసిన చమురు దిగుమతిపై సుంకం 20శాతానికి పెంచింది. శుద్ధి చేసిన నూనెలపై 13.75నుంచి 35.75శాతం వరకు పెంచింది. దీంతో వంటనూనెల ధరలు లీటరుపై దాదాపు రూ.25నుంచి రూ.30 వరకు పెరిగాయి. శనివారం ఫ్రీడమ్ ఆయిల్ 15 లీటర్ల క్యాన్ ధర రూ.1650 ఉండగా ఆదివారం రూ.1950కి చేరింది. అలాగే పామాయిల్ లీటర్ రూ.95నుంచి రూ.100 ఉండగా నేడు రూ.130కి చేరింది. దీంతో సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది.



ధరలు నియంత్రించాలి



మాది సామాన్య రైతు కుటుంబం. పంటలు పండితేనే కుటుంబం గడుస్తుంది. లేకపోతే అప్పులతో నెట్టుకురావాలి. ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో ఏమీ కొనలేకపోతున్నాం. ఇప్పుడు మళ్లీ నూనె ధరలు అమాంతంగా పెరిగాయి. నిత్యావసర సరుకుల ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వం ధరలను నియంత్రించాలి.

– కె.మాలతి, పాతహిరమండలం, హిరమండలం

పేదలపై భారం



ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు బాగా పెరిగాయి. ఇప్పుడు వంటనూనెల ధరలు కూడా పెరగడంతో పేదలు ఏమీ కొనే పరిస్థితి లేకుండా పోతోంది. ఒక్కసారిగా ధరలు పెరగడం సామాన్యులపై భారం మోపడమే. నిత్యావసర సరుకులు, నూనెల ధరలు పేదలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– దీర్ఘాశి లక్ష్మీనారాయణ, హిరమండలం

క్లుప్తంగా

రూ.లక్ష పలికిన వినాయక లడ్డూ



వేలంలో దక్కించుకున్న లడ్డూతో యువత

సోంపేట: సోంపేట పట్టణంలోని పొందర వీధిలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగించారు. ప్రత్యేక పూజలు, హోమం, భజనలు నిర్వహించారు. అన్న ప్రసాద కార్యక్రమం, లడ్డూ వేలం పాట నిర్వహించారు. మండలంలోని పాత్ర కొండ పంచాయతీ జగతికేశుపురం యువత రూ.లక్షకు లడ్డూను దక్కించుకున్నారు.

ఆసక్తికరంగా టెన్నీ కాయిట్ పోటీలు



రసవత్తరంగా సాగుతున్న క్రీడా పోటీలు

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరులో శనివారం ప్రారంభమైన 36వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల (రాష్ట్ర స్థాయి) బాల బాలికల టెన్నీ కాయిట్ క్రీడా పోటీలు ఆసక్తిగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి ఎన్.గౌతమ్ సంజయ్ (తూర్పుగోదావరి), జి.మహిధర్ (అనంతపురం), ఎస్.సాయి కుమార్ (విజయనగరం), కేఎస్ శంకరప్రసాద్ (తూర్పుగోదావరి)తో పాటు బాలికల విభాగం నుంచి కె.జ్యోతిక (అనంతపురం), హెచ్.స్పందన (అనంతపురం), ఆర్.సాంస్కృతి (పశ్చిమగోదావరి), హెచ్.దీక్షిత (అనంతపురం) జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చి సెమీఫైనల్‌కు చేరారు. ఈ క్రీడా పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు పైల గజేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర పండా పర్యవేక్షిస్తున్నారు. పోటీలు సోమవారంతో ముగియనున్నట్లు వారు తెలిపారు.

మంచం పట్టిన సుంకర జగన్నాథపురం



సుంకర జగన్నాథపురంలో జ్వరంతో బాధ పడుతున్న రోజారమణి

వజ్రపుకొత్తూరు: మండలంలోని సుంకర జగన్నాథపురం గ్రామం జ్వర పీడితులతో మంచం పట్టింది. ఏ ఇంట చూసినా జ్వర పీడితులే కనిపిస్తున్నారు. ప్రభుత్వ వైద్యులు ఈ గ్రామం వైపు చూడకపోవడంతో వారంతా ప్రైవేటు వైద్యంపై ఆధార పడుతున్నారు. పలాస, పూండిలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన కె.రాజారావు ఇంటిలో ఆరుగురు వరకు జ్వర పీడితులు ఉండగా లిమ్మాడ రోజారమణి, మాజీ సర్పంచ్ గంగెట్ల గున్నమ్మ, టి.కూర్మారావు, జి.భారతమ్మ, వి.ఎర్రమ్మతో పాటు మరో 80 మంది వరకు జ్వరంతో బాధపడుతున్నారు. ఏఎన్ఎం వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ జ్వరాలు అదుపులోకి రావడం లేదు. వైరల్ జ్వరాలతో పాటు, అక్కడక్కడా రక్తంలో ప్లేట్‌లెట్‌లు తగ్గిపోయి కీళ్ల నొప్పులు, దగ్గు, జలుబు తదితర లక్షణాలతో వారానికి పైగా లేవలేని స్థితితో ఉంటున్నారు. వైద్యులు గ్రామాన్ని సందర్శించి రక్త పరీక్షలు నిర్వహించి ఇంటింటా వై ద్య సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

కిడ్నీ ఆస్పత్రికి ఆక్సిజన్ ఫిక్స్‌డ్ ప్లాంట్

కాశీబుగ్గ: పలాసలో గత ప్రభుత్వం నిర్మించిన కిడ్నీ పరిశోధన కేంద్రానికి ఫిక్స్‌డ్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం ఆస్పత్రికి ఉన్న ఆక్సిజన్ పైప్‌లైన్‌లకు అనుసంధానం చేయనున్నారు. ట్రక్‌లో తీసుకువచ్చిన ఆక్సిజన్‌ను ఏర్పాటు చేసిన ట్యాంక్‌కు నింపే ప్రక్రియ చేపడుతున్నారు. ఇప్పటి వరకు చిన్నపాటి ట్యాంకర్లతో నిర్వహించే పద్ధతి ఇకపై మారనుంది. అనేక మంది రోగులు వస్తున్న తరుణంలో ఫిక్స్‌డ్ ఆక్సిజన్ ప్లాంట్ ఎంతో ఉపయోగ పడుతుంది.

● గణపతి సన్నిధిలో గణితావధానం



బూరగాం గ్రామంలోని సిద్ధి వినాయక పూజా మహోత్సవంలో శ్రీనివాస యువజన సంఘం వారు ఆదివారం గణితావధానం ఏర్పాటు చేసి శభాష్ అనిపించుకున్నారు. గణితావధాని మడ్డు తిరుపతిరావు సమన్వయకర్తగా 2 గంటల పాటు బాల మేధావిగా గుర్తింపు పొందిన ఉలాల నందుతో ఈ అవధానం నిర్వహించారు. అనంతరం వీరిని నిర్వాహకులు సత్కరించారు. - కంచిలి

● అద్భుతం.. అభినయం



ఛత్తీస్‌గఢ్‌లోని రాయగడలో ప్రతిష్టాత్మకమైన చక్రధర్ సమరోహ్ జాతీయ నాట్యోత్సవంలో పట్టణానికి చెందిన గురుపాత్రుని శ్రీకాంత్ శిష్యబృందం కూచిపూడి నాట్యప్రదర్శన చేసింది. ఈ సందర్భంగా బృందాన్ని అక్కడి కలెక్టర్ ఎం.కార్తికేయ గోయల్, ఎస్పీ ఎం.దివ్యాంగ పటేల్, రాజ్యసభ ఎంపీ ఎం దేవేంద్ర ప్రతాప్‌సింగ్‌లు ఘనంగా సత్కరించారు. - శ్రీకాకుళం కల్చరల్

● పుష్పయాగం..

శ్రీకాకుళంలోని విజయగణపతి ఆలయంలో స్వామిని ఆదివారం కుసుమాలతో అర్చించారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో రంగురంగుల చామంతులు, రంగు రంగుల గులాబీలు, మల్లెలు, విరజాజులు, సంపెంగలు, కనకాంబరాలు, తెల్ల నందివర్ధనాలతో పుష్పయాగం నిర్వహించారు. - శ్రీకాకుళం కల్చరల్



పనిగట్టుకుని.. స్థలాలు కొట్టేస్తున్నారు

- ఎల్ఎన్‌పేటలో చెరువు గట్ల ఆక్రమణ
- రూ.20 కోట్లు విలువ చేసే స్థలాలు కబ్జా
- ఆక్రమణదారులుగా 93 మంది గుర్తింపు
- 38 మందికే నోటీసులు జారీచేస్తున్న అధికారులు



డోల చెరువు గట్టుపై వెలసిన బహుళ అంతస్థుల భవనాలు

ఎల్ఎన్ పేట: మండల కేంద్రంలో చెరువులు 'గట్టు' డుకుతున్నాయి. 1999 ఫిబ్రవరిలో ఎల్.ఎన్.పేట కేంద్రంగా కొత్త మండలం ఏర్పడింది. ఇక్కడ అలికాం–బత్తిలి రోడ్డుకు ఎగువున డోల, బారికివాని చెరువులు ఉన్నాయి. తూర్పువైపు 1980లో వంశధార నదికి వచ్చిన వరదల సందర్భంగా నదీ తీర గ్రామాలకు చెందిన బాధితుల కోసం సేకరించిన రీహాబిటేషన్ కాలనీ స్థలం ఉంది. ఈ స్థలంలో అప్పటికే అనేక మంది పట్టాలు పొంది నిర్మాణాలు చేపట్టారు. ఇక మిగిలిన డోల, బారికివాని చెరువు గట్లపై విపరీతంగా ఆక్రమణలు జరుగుతున్నాయి. మండల కేంద్రం ఏర్పడడంతో భూములకు విలువ పెరిగిపోయింది. దీంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా ఆక్రమణకు పాల్పడుతూ వచ్చారు. చెరువు గట్టును ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు, బహుళ అంతస్థుల భవనాలు నిర్మించుకుంటూ వస్తున్నారు.

ఆక్రమణలు రూ.20కోట్లకు పైనే

డోల, బారికివాని చెరువు గట్లపై ఆక్రమణల విలువ రూ.20కోట్లకు పైనే ఉంటుంది. వంశధార రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా అనేక మంది నిర్వాసితులు మండల కేంద్రానికి తరలి రావటంతో భూముల ధరలు కూడా చుక్కలనంటేలా పెరిగిపోయాయి. వాణిజ్య పరంగా రోజురోజుకు అభివృద్ధి చెందటంతో బడ్డీ కొట్టు పెట్టుకునేంత కొద్ది పాటి స్థలం ఉంటే చాలు రూ.5లక్షల నుంచి రూ.10లక్షల ధర పలుకుతుంది. ఇక్కడ ధరలతో పాటు అద్దెలు కూడా అదే స్థాయిలో వస్తున్నాయి. దీంతో అటు చెరువు గట్టును, మరోవైపు ఆర్అండ్‌బీ రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు.

93 మంది ఆక్రమణదారుల గుర్తింపు

ఆక్రమణలపై ఐదేళ్ల క్రితం పత్రికల్లో కథనాలు రావటంతో అప్పటి అధికారులు ఆక్రమణలు తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. డోల, బారికివాని చెరువు గట్టులను 93 మంది ఆక్రమించుకున్నట్లు గుర్తించారు. ఆక్రమణలు తొలగించేందుకు రెవెన్యూ అధికారులు పోలీసు బలగాలను రప్పించారు. జేసీబీ లాంటి యంత్రాలను తెచ్చారు. మరికొన్ని క్షణాల్లో ఆక్రమణలు తొలగిస్తారని అంతా అనుకుంటున్న సమయంలో అధికారులపై ఎక్కడెక్కడి నుంచో ఒత్తిడి రావటంతో ఆక్రమణలు అలాగే వదిలేశారు. దీంతో ఎక్కడో ఉన్న మరికొంత స్థలాన్ని ఆక్రమించుకుని బహుళ అంతస్థుల భవనాలు నిర్మించుకున్నారు. 93 మంది ఆక్రమణదారుల్లో ఇప్పుడు 38 మందికి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. ఇప్పుడు కూడా ఆక్రమణదారులు అధికార పార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు మొదలు పెట్టారు. వారిని ఒప్పించి అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

38 మందికి నోటీసులు ఇచ్చాం

మండల కేంద్రంలోని డోల, బారికివాని చెరువుల ఆక్రమణదారులు 38 మందికి నోటీసులు ఇచ్చాం. చెరువు గట్లపై ఉన్న నిర్మాణాలను పది రోజుల్లో ఖాళీ చేయాలని నోటీసుల్లో పేర్కొన్నాం. ఇక్కడి పరిస్థితిని కలెక్టర్‌కు నివేదించాం. కలెక్టర్ సూచనలు ప్రకారం ఆక్రమణలు తొలగించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాం. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం చెరువులు, చెరువు గట్లు ఆక్రమణ చేయకూడదు.

– వైపీ పద్మావతి, తహసీల్దారు, ఎల్.ఎన్.పేట

రైతుల కోసం మంత్రి అచ్చెన్న మాట్లాడటమా..!

- రైతు చెంతకే సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిది
- ఒక్క టెక్కలి నియోజకవర్గంలో రూ.359.72 కోట్లు సంక్షేమం రూపంలో అందజేశాం
- పెట్టుబడి సాయం ఎప్పుడు ఇస్తారో ముందు చెప్పాలి
- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



టెక్కలి: ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పూర్తి స్థాయిలో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇవ్వలేని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులను పట్టించుకోలేదని విమర్శించడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మండిపడ్డారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో విత్తనాలు, ఎరువులు కావాలంటే రైతులు కిలోమీటర్ల కొద్దీ క్యూ కట్టే పరిస్థితిని మరచిపోయారా అని ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ స్థాయిలో రైతుల చెంతకే సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని అన్నారు. రైతు భరోసా కేంద్రాలు, అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసి అక్కడ రైతులకు అందుబాటులో వ్యవసాయ సిబ్బందిని నియమించామన్నారు. ఒక్క టెక్కలి నియోజకవర్గంలో రైతు భరోసా, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ రూపంలో సుమారు రూ.359.72 కోట్లు అందించామని గుర్తుచేశారు. ఈ విషయం తెలుసుకోకుండా మంత్రి అచ్చెన్న విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. గత టీడీపీ పాలనలో హుద్‌హుద్ తుపాన్, తిత్లీ తుఫాన్‌కు నష్టపోయిన రైతుల్ని పట్టించుకోలేదని మళ్లీ వైఎస్సార్‌సీపీ పాలనలోనే ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.64 కోట్లు ఇచ్చామన్నారు. తిత్లీ నష్టం పేరుతో ఎంతో మంది టీడీపీ కార్యకర్తలు జేబులు నింపుకున్న సంగతి మరచిపోయారా అని ఎద్దేవా చేశారు. ఇప్పుడు మీరు ఇచ్చిన హామీల్లో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఎప్పుడిస్తారో... చెప్పిన తర్వాత విమర్శలు చేయాలని హితబోధ చేశారు. తమ ప్రభుత్వ హయాంలో రైతులకు చేసిన మంచిని వివరించడానికి బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, టీడీపీ పాలనలో రైతులకు ఏం మేలు చేశారో చెప్పడానికి మీరు సిద్ధంగా ఉన్నారా అని సవాల్ విసిరారు.

ఉక్కు ఉద్యమానికి కలాలు, గళాల మద్దతు



ఉక్కు కవనం పుస్తకావిష్కరణ చేస్తున్న అరసం నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్మిక ఉద్యమానికి కవులు, రచయితలు, మేధావులు మద్దతు ప్రకటించారు. ఆదివారం ఉదయం స్థానిక గరిమెళ్ల ప్రెస్‌క్లబ్‌లో అరసం శ్రీకాకుళం జిల్లా శాఖ నిర్వహించిన సమావేశంలో ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ, ఉక్కు ఉద్యమానికి మద్దతుగా ఉత్తరాంధ్రలో ఐక్య సంస్కృతిక పోరాట వేదికను రూపొందించాలని పిలుపునిచ్చారు. ఉద్యమానికి మద్దతుగా విశాలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని కోరారు. ఇటీవల మరణించిన సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి అరసం జిల్లా శాఖ అధ్యక్షులు నల్లి ధర్మారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పశ్చిమగోదావరి జిల్లా అరసం శాఖ ప్రచురించిన ఉక్కు కవనం అనే కవిత సంకలనాన్ని అతిథులు ఆవిష్కరించారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు వీజీకే మూర్తి మాట్లాడుతూ ప్రైవేటీకరణ కాకుండా మరో విశాల ఉద్యమం చేయాలన్నారు. గంగవరం పోర్టును అదానీకి కట్టబెట్టారని, విశాఖ ఉక్కును కూడా అలాగే కట్టబెట్టాలని చూస్తున్నట్లు జన సాహితీ ప్రతినిధి పి.మోహన్ రావు విమర్శించారు.

గోవిందరావు నేత్రాలు సజీవం



కార్నియా సేకరిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళమ కల్చరల్: నగరంలోని మొండేటివీధి(కిన్నెర వెనుక)లో నివాసం ఉంటున్న పెన్షిపోతుల గోవిందరావు(84) అనారోగ్య కారణంగా ఆదివారం మృతి చెందారు. ఆయన నేత్రాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు పి.కుమార్‌రాజా, జి.గోవిందరాజులు, జి.సుగుణకర్ ముందుకువచ్చారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా, నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, సహాయకులు పవన్‌కుమార్‌లు కార్నియాలను సేకరించారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు వినియోగించుకోవాలి : ఎస్పీ



లాక్డ్ హౌస్ మానిటరింగ్ తెలిపే చిత్రం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని ప్రజలు ప్రయాణాలకు వెళ్లే ముందు ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) పోలీస్ సేవలు తప్పకుండా వినియోగించుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఓ ప్రకటన ద్వారా కోరారు.

ఇలా అప్‌లోడ్ చేయాలి..

ఇంటర్నెట్ ద్వారా గూగుల్‌ప్లేస్టోర్‌లో ఉన్న ఎల్‌హెచ్ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పేరు, చిరునామా, మొబైల్ నంబర్ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఒక ఓటీపీ వస్తుందని, దాన్ని సబ్మిట్ చేస్తే మొబైల్ నంబర్‌కు రిజిస్ట్రేషన్ ఐడీ వస్తుందని తెలిపారు. యాప్ ఓపెన్ అయ్యాక ఐడీ నంబర్, ప్రయాణం తేదీ, సమయాన్ని నమోదు చేసి రిక్వెస్ట్ పంపితే ఇంటికి ఆ పరిధి పోలీస్ స్టేషన్ నుంచి కానిస్టేబుళ్లు వచ్చి ఇంటి లోపల మోషన్‌సెన్సార్ కెమెరాను నిక్షిప్తం చేస్తారని తెలిపారు.

కమాండ్ కంట్రోల్ రూం నుంచి..

అప్పటి నుంచి జిల్లా కంట్రోల్ రూమ్ ఆ ఇంటిని 24/7 పర్యవేక్షిస్తుందని తెలిపారు. దూర ప్రాంత ప్రయాణాలకు (ఇంటికి తాళం వేసి) వెళ్లేటప్పుడు వివరాలను డౌన్‌లోడ్ చేసుకున్న యాప్ ద్వారా ముందస్తుగా తెలియజేస్తే ఇంటి వద్ద పోలీసులు గస్తీ, భద్రత పెంచడంతో పాటు చోరీ నివారణకు, నేర నియంత్రణకు చర్యలు తీసుకుంటారని ఎస్పీ పేర్కొన్నారు.

పట్టణ ప్రాంతాల్లో 24 గంటలు పోలీసులు గస్తీ తిరుగుతుంటారని అత్యవసర పరిస్థితుల్లో 100 కు ఫోన్ చేసి సమాచారమందించాలన్నారు.

ఏపీ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం



ఎన్నికైన ఏపీ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలు రాష్ట్ర పరిశీలకులు బీఎస్ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొనేల గోపాల్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా ఆర్.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడుగా పి.శ్యామ్‌సుందర్, పి.ధనుంజేయరావు, శ్రావణి, రఘునాథరావు, జనరల్ సెక్రటరీగా కె.మల్లేశ్వరరావు, ట్రెజరర్‌గా వై.ఆదిలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా యు.ప్రీతి, పి.శ్రీనివాసరావు, ఎస్.రమేష్, ఎల్.రామారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సోమేశ్వరరావు, చక్రవర్తి, భవాని, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు మంచిది కాదు



మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఈనెల 10వ తేదీ ఉదయం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదం అనంతరం నెలకొన్న పరిణామాలు రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో చర్చనీయాంశమయ్యాయని ఏఐసీసీ సభ్యులు, పీసీసీ వర్కింగ్ కమిటీ మాజీ అధ్యక్షుడు పి.రాకేష్ రెడ్డి అన్నారు. శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఏఐసీసీ సభ్యుడు రాకేష్‌రెడ్డి ఆదివారం సందర్శించి అగ్ని ప్రమాదం జరిగిన గదిని తోటి కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజకీయాల్లో తమ అభిప్రాయాల్ని వ్యతిరేకించే వారిని కూడా గౌరవించే సంస్కృతి ఉండాలని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడి తప్పుడు ఫిర్యాదులు ఇచ్చే సంస్కృతి మంచిది కాదని అన్నారు. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అగ్ని ప్రమాదంపై ఫిర్యాదు చేస్తూ మాజీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావును కారకుడిగా పేర్కొనటం, మేడమ్ సలహా మేరకు తాను ఫిర్యాదు చేశానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటువంటి సలహాలు ఇచ్చే మేడం మా పార్టీలో ఎవరంటూ ఆయన నిలదీశారు. తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన సదరు మేడమ్ ఎవరో నిగ్గు తేల్చాలంటూ ఆయన పార్టీ అధిష్టానాన్ని, జిల్లా పోలీస్ శాఖను కోరినట్లు తెలిపారు.

రంగనాథ స్వామి ఆలయంలో చోరీ



ఫరీదుపేటలో రంగనాథ స్వామి ఆలయంలో ఆధారాలు పరిశీలిస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట గ్రామంలో గల రంగనాథ స్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. రాత్రి ఆలయం మూసివేత అనంతరం ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులకు పగలగొట్టిన గడియలు, తెరిచిన తలుపులు, ధ్వంసమైన హుండీలు కనిపించాయి. ఉదయం ఆలయాన్ని చూసిన సేవా ట్రస్ట్ ప్రతినిధులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జేఆర్ పురం సీఐ ఎం.అవతారాం, ఎచ్చెర్ల ఎస్ఐ సందీప్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గర్భగుడి తలుపులు తాళాలను విరగ్గొట్టారు. రెండు హుండీలను పగలగొట్టారు. నాలుగు తులాల బంగారం, ఐదు కిలోల వెండి వస్తువులు చోరీ జరిగినట్లు అనుమానిస్తున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ అధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు. వరుసగా ఆలయాల్లో చోరీలు జరుగుతుండడంతో చర్చనీయాంశమవుతోంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పాతబస్టాండ్ సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. మూడు నెలలుగా ఇదే ప్రాంతంలో ఆయన యాచక వృత్తిని కొనసాగిస్తున్నారని, 45 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయసు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు వడ్డి మోహనరావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నవంబర్ 17న కార్మిక సంఘం జిల్లా మహాసభలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నవంబర్ 17న జరగనున్న జిల్లా జట్టు ముఠా, కళాసీ కార్మిక సంఘం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.చిన్నారావు, కె.సూరయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జట్టు ముఠా కళాసి కార్మిక సంఘం శ్రీకాకుళం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హమాలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేకుంటే పోరాటాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని, సంవత్సరానికి రెండు జతల బట్టలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో విశ్రాంతి గదులు, మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికులందరికీ ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు.